ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు

5

మంగళవారం 1 ఏప్రిల్ 2025





ఒంటిమిట్ట కోదండరామాలయం..

కల్యాణోత్సవానికి
విస్తృత ఏర్పాట్లు

ఒంటిమిట్ట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంటిమిట్టలోని టీటీడీ పరిపాలన భవన సమావేశ మందిరంలో ఎస్పీ అశోక్‌కుమార్, జేఈవో వీరబ్రహ్మం, డీఆర్వో విశ్వేశ్వర్‌నాయుడుతో కలిసి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై టీటీడీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 5 నుంచి 15వ తేదీ వరకు కోదండరాముడి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయన్నారు. 11న జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు పాల్గొన్నారు.

మార్కెట్ లీజు టెండర్‌పై..
వైసీపీ రాజకీయం

ప్రొద్దుటూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ తాత్కాలిక కూరగాయల మార్కెట్‌ను ఏడాదిపాటు లీజుకు ఇచ్చేందుకు మార్చి 25న అధికారులు టెండర్లు పూర్తి చేశారు. లీజు వేలం రూ.1,60 ,80,000 పలకడంతో మున్సిపాలిటీకి గత ఏడాదికంటే రూ.27 లక్షలు అదనంగా ఆదాయం సమకూరనుంది. ఈ లీజు టెండరును కౌన్సిల్లో పెట్టి ఆమోదించాలి. లేదంటే మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి లీజు టెండరుకు ముందస్తు ఆమోదం తెలపాల్సి ఉంది. ఎందుకంటే ఏప్రిల్ 1 తేది నుంచి మార్కెట్ లీజును కాంట్రాక్టర్‌కు అప్పగించాలి. కానీ చైర్‌పర్సన్ మార్కెట్ లీజు టెండర్‌కు ముందస్తు ఆమోదం తెలపలేదు. తద్వారా మున్సిపల్ ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది. మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజా తన బినామీతో గత ఏడాది మార్కెట్ వేలం దక్కించుకున్నారు. మార్చి నెల ముగుస్తున్నా.. మార్కెట్‌లీజుకు సంబంధించి ఇంకా రూ.30 లక్షలకు పైగా మున్సిపాలిటీకి బకాయి పడ్డారు. మళ్లీ మార్చి 25న జరిగిన వేలంలో తన సోదరుడు నిజాం పాల్గొన్నారు. ఈ లీజు తమకు దక్కలేదనే సాకుతో ఎలాగైనా మార్కెట్ లీజువేలం టెండరును ఆమోదించకుండా చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ద్వారా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈ లీజు టెండరుకు ముందస్తు ఆమోదం కోసం కమిషనర్ మల్లికార్జున చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవికి లెటరు పెట్టినా ఆమె స్పందించలేదు. దీంతో ఆయన మరోమారు లెటర్ పంపించారు.

10 మండలాల్లో కరువు

- ప్రకటించిన ప్రభుత్వం

కడప రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 9 మండలాలు తీవ్ర కరువుతో ఇబ్బంది పడుతుండగా ఒక మండలంలో మోస్తారు కరువు ఉందని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఇందులో దువ్వూరు, మైదుకూరు, బ్రహ్మంగారి మఠం, కాశినాయన, ఖాజీపేట, చాపాడు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, తొండూరు తీవ్రమైన కరువు మండలాలుగా.. వైలవరంను మోస్తారు కరువు మండలంగా సూచించింది. ఈ మేరకు కలెక్టర్ అవసరమైన తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

ఒంటిమిట్ట అభివృద్ధికి గ్రహణం

- చంద్రబాబు హయాంలో రూ.100 కోట్లతో మాస్టర్ ప్లాన్
- దాదాపు 60 శాతం పనులు పూర్తి
- మిగిలిన పనులు పూర్తి చేయని జగన్
- ఎత్తిపోయిన శ్రీరామ ఎత్తిపోతల పథకం
- ఇప్పటికీ పూర్తికాని కల్యాణ మండపం
- చంద్రబాబు సీఎం కావడంతో.. ఒంటిమిట్ట అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు
- 5 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు



ఇంకా పూర్తి కాని కోదండరాముని రక్షిత మంచినీటి పథకం


> విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని ఆంధ్ర భద్రాద్రిగా నాటి చంద్రబాబునాయుడు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఈ ఆలయాన్ని దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అప్పట్లోనే రూ.100 కోట్ల మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఆ మేరకు పనులు మొదలుపెట్టి దాదాపు 60శాతం పూర్తి చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఉమ్మడి కడప జిల్లా వాసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఒంటిమిట్ట కోదండరామాలయంలో అభివృద్ధి పనులు ఒక్కటీ జరగలేదు. సరికదా.. చంద్రబాబు హయాంలో చేపట్టిన పనులనూ పట్టించుకోలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉండడంతో ఇక ఒంటిమిట్ట దశ మారుతుందని ప్రజలు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు. ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలు 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. కల్యాణం రోజున ముఖ్యమంత్రి రానున్నందున ఒంటిమిట్ట అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తారని భక్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రాజంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విడిపోయిన తరువాత భద్రాచలం రీతిలో ఎంతో ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం ఉన్న కోదండరామాలయాన్ని ఆంధ్ర భద్రాద్రిగా ప్రకటించారు. ప్రకటించిన తరువాత ఒక సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వమే కల్యాణోత్సవ ఏర్పాట్లు చేసింది. తదనంతరం ఈ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి అప్పజెప్పారు. ఆ సమయంలో టీటీడీ నుంచి రూ.100 కోట్ల నిధులను కేటాయించి కోదండరామాలయాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఆ నిధులతో నిత్యం కరువుతో ఇబ్బందులు పడుతున్న ఒంటిమిట్ట ప్రాంతంలో రైతులను ఆదుకోవడంతో పాటు పర్యాటక శోభ పెంచేలా ఒంటిమిట్ట చెరువును నీటితో నింపి హైదరాబాదు ట్యాంక్ బండ్‌రీతిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సోమశిల వెనుక జలాల నుంచి ఆరు నెలల వ్యవధిలో సుమారు 15 కి.మీ మేర ప్రత్యేక పైపులైన్లు ఏర్పాటు చేసి ఎత్తిపోతల పథకం ట్యాంకులను, మోటార్లను ఏర్పాటుచేశారు. శ్రీరామ ఎత్తిపోతల పథకంగా నామకరణం చేసి ఒంటిమిట్ట చెరువుకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నీరందించింది. ఇక మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సుమారు రూ.60 కోట్లతో ఆలయం వద్ద అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సుమారు లక్ష మంది వీక్షించే విధంగా కల్యాణ మండపం ఏర్పాటు, మాడ వీధుల ఆధునికీకరణ, ఉద్యానవనాల ఏర్పాటు, ప్రత్యేక క్యూలైన్ల నిర్మాణం, అన్న ప్రసాద సత్రం.. ఇలా ఎన్నో నిర్మాణాలు చేపట్టారు. అయితే కల్యాణమండపం సగం మాత్రమే పూర్తయింది. మిగిలిన భాగాన్ని నిధుల లేమితో జగన్ ప్రభుత్వం చేపట్టలేదు.

శ్రీరామ ఎత్తిపోతల పథకానికి తుప్పు

తెలుగుదేశం హయాంలో రూ.33.44 కోట్లతో ఏర్పాటు చేసిన శ్రీరామ ఎత్తిపోతల పథకం ఒంటిమిట్ట అభివృద్ధిలో కీలకమైంది. ఆ పథకం నిర్వహణలో కూడా జగన్ ప్రభుత్వం విఫలైమంది. ప్రస్తుతం ఈ పథకం పైపులన్నీ పూర్తిగా పాడైపోయాయి. ఈ పైపుల స్థానంలో సుమారు రూ.11 కోట్ల ఖర్చుతో ఇనుప పైపులైన్లు కొత్తగా వేసి పథకాన్ని పునరుద్ధరిస్తే తప్ప సోమశిల ద్వారా చెరువుకు నీరు వచ్చే పరిస్థితి లేదు. బ్రహ్మోత్సవాల సమయంలో చెరువులో పుష్కలంగా నీరుంటే ఆలయం చుట్టూ ప్రకృతి శోభ కనిపించేది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒంటిమిట్ట చెరువు పైపు లైనును పునరుద్ధరించి ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

ఇటీవలే రాష్ట్ర టూరిజంశాఖ మంత్రి కందుల దుర్గేశం ఒంటిమిట్టకు చుట్టుపక్కల ఆలయాలను కలుపుకుంటూ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఒంటిమిట్ట చెరువుకు నీరందించి బోటు షికారు నిర్వహించి టూరిజం హబ్‌గా మారుస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పర్యాటకశాఖ కూడా కేంద్రం నిధులతో అభివృద్ధి చేయడానికి నిర్ణయించిందని చెప్పారు. మంత్రి ఇచ్చిన హామీలన్నీ వీలైనంత తొందరగా కార్యరూపం దాల్చాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.



శ్రీరామ ఎత్తిపోతల పథకం పూర్తి కాకపోవడంతో అరకొర నీటితో ఒంటిమిట్ట చెరువు


కనిపించని ఆధ్యాత్మిక, పర్యాటక శోభ

చంద్రబాబునాయుడు ఆలోచనకు తగ్గట్టు రూ.100 కోట్ల మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఇక్కడ ఆధ్యాత్మికత ఉట్టిపడే రీతిలో అభివృద్ధి జరగలేదు. టూరిజమూ అభివృద్ధి చెందలేదు. చాలా పనులు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

- ఆలయానికి సమీపంలో చెరువు కట్టపై ఆంజనేయుడు, జాంబవంతుడు, శ్రీరాముని విగ్రహాలు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేయలేదు.
- ఒంటిమిట్ట ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేస్తామన్న ధ్యానమందిరం జాడే లేదు.
- ఆలయానికి అనుకుని ఉన్న ప్రధాన హైవే మార్గంలో రాత్రి వేళ కనువిందు కలిగించేలా విద్యుద్దీపాలను ఏర్పాటు చేయలేదు.
- తిరుమల రీతిలో ఒంటిమిట్టలో సదుపాయాలు కల్పించి ఆధ్యాత్మిక శోభను ఏర్పాటు చేయాల్సి ఉండగా అందుకు తగ్గట్టు ఏ పనీ చేయలేదు. ఆలయం చుట్టూ ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే రీతిలో కోదండరాముని స్వాగత తోరణాలు ఏర్పాటు చేయలేదు. బ్రహ్మోత్సవాల వేళ టీటీడీ సిబ్బంది అంతా ఒంటిమిట్టకు చేరుకుని ఆర్భాటంగా పనులు చేస్తారు తప్ప ఆ తర్వాత ఏడాదిలో ఒక్కసారి కూడా మచ్చుకైనా కనిపించరు. అలా కాకుండా ఒంటిమిట్టను అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

అసంపూర్తిగా కల్యాణ మండపం

ఒంటిమిట్ట కోదండరామాలయ అభివృద్ధిలో ప్రధానమైనది కల్యాణ మండపం. బ్రహ్మోత్సవాల సమయంలో ఇక్కడ సీతారాముల కల్యాణం రాత్రివేళ జరుగుతుంది. ఆ రోజున లక్ష మందికి పైబడి భక్తులు ఇక్కడకు విచ్చేస్తారు. కల్యాణ మండపం లేని సమయంలో వీచిన భారీ ఈదురు గాలులకు తాత్కాలిక రేకుల షెడ్డు పడిపోయి అప్పట్లో పలువురు చనిపోయారు. ఇలాంటి ప్రమాదాలను అరికట్టడానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కల్యాణ మండపం నిర్మాణాన్ని ప్రారంభించారు. చకచకా పనులు జరిగినా 50 శాతం మాత్రమే కల్యాణ మండపం పూర్తయింది. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాన్ని పూర్తి చేయాల్సి ఉంది.



అసంపూర్తిగా ఉన్న కోదండరాముని కల్యాణ మండపం

ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు



బిల్టప్ వద్ద ప్రత్యేక రంజాన్ నమాజ్‌లో ముస్లింలు

కడప కల్చరల్, మార్చి31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లింలు అత్యంత ఆనందంగా జరుపుకున్నారు. నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు సోమవారం అన్ని ఈద్గా మైదానాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడపలోని బిల్టప్ వద్ద గల ఈద్గాతో పాటు ఆలంఖాన్‌పల్లె (దండు) సమీప మురాదియ షాహి ఈద్గాలో ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాగా ముందస్తు జాగ్రత్తలో భాగంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మత పెద్దలు తమ దివ్య సందేశాన్ని అందించారు. మతాలు వేరైనా దేవుడు ఒక్కడే అని.. సోదర భావంతో కలిసిమెలసి జీవించాలని, పరస్పరం ఐక్యతతో ఆనందకరంగా ఉండాలని అన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.



దువా చదువుతున్న మత గురువు న్యామతుల్లా, చిత్రంలో పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేనీ, టీడీపీ నేత అమీర్‌బాబు, వైసీపీ నేత అంజాద్‌బాషా తదితరులు

ఇక రిజిస్ట్రేషన్లు సులభతరం

- నేటి నుంచి స్లాట్ బుకింగ్

కడప కలెక్టరేట్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖలో ప్రక్షాళన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. స్థిరాస్తిదారులు భూములు, స్థలాలు ఇతరత్రా అనుకున్న తేదీకి, అనుకున్న సమయానికి సులభతరంగా, పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు చేసుకొనే వెసులుబాటు కల్పించింది. దళారుల ప్రమేయం లేకుండా స్లాట్ బుకింగ్ అమలు జరగనుంది. ఈ మేరకు స్లాట్ బుకింగ్ డిజిటల్ క్యూ మేనేజ్మెంట్ సిస్టమ్ (డీక్యూఎంఎస్) పద్ధతిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను జిల్లా ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తక్షణమే అమలు చేయాలంటూ రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ మార్గదర్శకాలు జారీ చేశారు. దీంతో మంగళవారం నుంచే స్లాట్ బుకింగ్ విధానాన్ని కడప అర్బన్, రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాల యాల్లో అమలు జరిగేలా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు కసరత్తు ముమ్మరం చేశారు.

స్లాట్ బుకింగ్‌తో దళారులకు చెక్

ఏదైనా స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లకు వెళితే డాక్యుమెంట్ రైటర్లు, దళారుల పెత్తనం సాగేది. క్రయవిక్రయ దారులకు స్టాంపు డ్యూటీ, చలానాలకు దీటుగా ఆ ఫీజు, ఈ ఫీజు అంటూ వసూళ్లకు దిగుతున్నారు. తాజాగా అమలు చేయనున్న స్లాట్ బుకింగ్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు సాగితే దళారులకు చెక్ తప్పదు. రిజిస్ట్రేషన్ల కోసం వెళ్లే కక్షిదారులకు రోజంతా నిరీక్షించే అవసరం ఉండదు. స్లాట్ విధానంలో ఏ సమయానికి రిజిస్ట్రేషన్ చేస్తారనే సమాచారం క్రయ, విక్రయదారుల సెల్‌ఫోన్లకు మెసేజ్ రూపంలో వెళుతుంది. ఆ సమయానికి దస్తావేజులు సిద్ధం చేసుకుని వెళితే గంటలోపే రిజిస్ట్రేషన్ ముగుస్తుంది. స్లాట్ బుకింగ్‌కు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. అదే స్లాట్ రద్దు చేసుకోవాలంటే రూ.100 వరకు చెల్లించాల్సి ఉంటుంది. మళ్లీ అదే స్లాట్‌ను బుక్ చేసుకోవాలంటే రూ.200లు చెల్లించాలి. సెలవు దినాల్లో కూడా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్‌కు ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్లో లాగిన్ అయితే నిర్ణయించిన తేదీల్లో రిజిస్ట్రేషన్ జరుగుతుంది.

ఈ విషయంపై జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1వతేదీ నుంచి స్లాట్ బుకింగ్ అమలు చేయనున్నా మన్నారు. జిల్లా కేంద్రంలోని అర్బన్, రూరల్ కార్యాలయాల్లో ముందుగా అమలు చేస్తున్నామన్నారు. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించిన మీదట అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అమలు చేస్తామన్నారు.

దాయాదుల ఘర్షణ..
ఒకరి మృతి

- పలువురికి తీవ్ర గాయాలు
- ఐదు ద్విచక్ర వాహనాల కాల్చివేత



మృతిచెందిన పెసల నారాయణరెడ్డి



తీవ్రంగా గాయడపడ్డ పెసల జయరామిరెడ్డి



కాలిపోయిన ఐదు ద్విచక్ర వాహనాలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని మద్దిరెడ్డిపల్లెలో దాయాదులైన ఇరువర్గాల వారు భూ సమస్యతో ఘర్షణకు దిగగా ఒకరు మృతిచెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఐదు ద్విచక్ర వాహనాలు దహనమయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు..

మద్దిరెడ్డిపల్లెకు చెందిన పెసల నారాయణరెడ్డి, పెసల జయరామిరెడ్డి దాయాదులు. వీరు సర్వే నెం.158లో గల భూమికి సంబంధించి తరచూ ఘర్షణకు పాల్పడేవారు. ఈ నేపథ్యంలో సోమవారం ఇరువర్గాల వారూ మరోమారు పొలం వద్ద ఘర్షణకు దిగారు. మాటా మాటా పెరగడంతో కత్తులు, వేట కొడవళ్లతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో పెసల నారాయణరెడ్డి మృతిచెందగా ఈయన వర్గానికి చెందిన శివారెడ్డి, ఆదిలక్షుమ్మ, మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే మరో వర్గంలోని జయరామిరెడ్డి, శివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, శివారెడ్డి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిలో ఒక వర్గం వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి, మరో వర్గం వారిని కడప రిమ్స్‌కు 108 వాహనంలో తరలించారు. అలాగే ఈ ఘర్షణలో ఐదు ద్విచక్రవాహనాలు కాలిపోయాయి. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఘర్షణ చోటు చేసుకుందని గ్రామస్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

రూ.409 కోట్లతో ఉపాధి

- 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేయడమే లక్ష్యం
- ప్రతి కుటుంబానికి వంద రోజుల పని
- మూడు నెలల్లో 85 లక్షల పనిదినాలు
- నేడు పశువుల నీటి తొట్లకు భూమి పూజ

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ పనులు ముగిశాయి. ఖరీఫ్ ప్రారంభం అయ్యేంత వరకు అంటే మరో మూడు నెలల వరకు వ్యవసాయ పనులుండవు. ఈ 90 రోజులు కూలీలను ఉపాధి హామీ పథకం ఆసరాగా నిలవనుంది. ఎంతగా అంటే.. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లోనే జిల్లాకు ఇచ్చిన పని దినాల టార్గెట్‌లో 85 శాతం పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికార యంత్రాంగం రోడ్ మ్యాప్ తయారు చేసుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.409.33 కోట్లు ఖర్చు చేయనున్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.9కోట్లు ఇది అదనం. ఈసారి 72.25లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మంగళవారం నుంచి రోజుకు కూలి రూ.320 పడనుంది. కేటాయింపు మొత్తంలో కూలీ సొమ్ము రూ.245.60 కోట్లు, మెటీరియల్ కాంపొండుకు రూ.163.73 కోట్లు మిగతాది అడ్మినిస్ట్రేషన్ ఇతరత్రాకు ఖర్చు పెట్టనున్నారు. జిల్లాలో వేసవిలో పశువులకు తాగునీటి వసతి కోసం 712 పశువుల తొట్లను నిర్మించాలని పశుసంవర్ధకశాఖ అంచనా వేసింది. ఇందులో తొలి విడతలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా 560 పశువుల తాగునీటి తొట్లకు భూమిపూజ చేయనున్నారు. వీటిని 10వతేదీలోపే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

వందరోజుల పనిదినాలు లక్ష్యం

ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాలు కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 11,854 కుటుంబాలకు వందరోజులు పనిదినాలు కల్పించారు. ఆ ఏడాది 77లక్షల పనిదినాలు లక్ష్యం కాగా దాదాపు టార్గెట్ రీచ్ అయ్యారు. ఈ సారి కూడా లక్ష్యాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. వీలైనంత వరకు ఎక్కువ కుటుంబాలు పనికి వచ్చేలా అధికారులు నిర్ణయించారు.

మూడు నెలల్లో..

ఉపాధి పనులకు ఏప్రిల్ నుంచి కూలీలు పోటెత్తుతారు. మార్చి నెల చివరి వారంలో 29వేల మంది పనులకు వచ్చారు. అయితే మంగళవారం నుంచి రోజుకు 60వేల మంది హాజరవుతూ మేలో రోజుకు లక్ష మంది వస్తారని, జూన్‌లో కూడా ఈ సంఖ్య లక్ష దాకా ఉంటుందని అంచనా వేశారు. ఈ మూడు నెలల్లోనే 85లక్షల పనిదినాల్లో 85శాతం పూర్తి చేయాలని నిర్ణయించారు.

ప్రధాన పనులు ఇవే

ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. పశువుల నీటి తొట్లు, పంటకుంటలు, పంటకాల్వల్లో పూడిక తీత, సాగునీటి చెరువుల్లో పూడిక తీత, చెరువుల కట్టలు బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో మూడు నెలల్లో 6వేల ఫారంపాండ్‌లు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. 500 చెరువుల్లో పూడిక తీత, చెరువుల కట్టలు పటిష్టం చేయడం, ఏప్రిల్ 10లోపు 560పశువుల తొట్ల నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తాం



ఈ ఆర్థిక సంవత్సరంలో 70 లక్షల పనిదినాలు కేటాయించారు. అడిగిన ప్రతి కుటుంబానికి పని కల్పిస్తాం. రాబోయే మూడునెలల్లోనే 80 శాతం పనిదినాలు పూర్తి చేస్తాం. కాలవల్లో, చెరువుల్లో పూడికతీత చేపట్టి వర్షాకాలం నాటికి ఫారంపాండ్స్‌లో చెరువుల్లో నీరు నిలిచేలా చేస్తాం. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూగర్భంలోకి ఇంకే విధంగా చూస్తాం.

- ఆదిశేషారెడ్డి, డ్వామా పీడీ

నీటిలో మునిగి యువకుడి మృతి


యువకుడి మృతదేహం

జమ్మలమడుగు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెన్నానది వంతెన కింద ఉన్న నీటి గుంతలలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జమ్మలమడుగు పట్టణంలోని కాపువీధికి చెందిన పగడాల ఆదిలక్ష్మి ఇళ్లలో పనిచేసి కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమె మొదటి కుమారుడు లోకేశ్ (24)కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. దీంతో ఎవరికీ చెప్పకుండా ఎక్కడెక్కడికో వెళ్లిపోతుంటాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమె లోకేశ్ కాళ్లను తాడుతో కట్టేసి పనికి వెళ్లింది. అయితే, ఉదయం 8 గంటల సమయంలో కట్టు తొలగించుకున్న లోకేశ్ కనిపించకుండా పోయాడు. కాగా, అతను స్థానిక ముద్దనూరు రోడ్డులోని వంతెన కింద పెన్నానదిలోని నీటి గుంతల్లో ప్రమాదవశాత్తూ పడి మునిగిపోయినట్లు సమాచారం అందడంతో పోలీసులు మృతదేహాన్ని బయటికి తీశారు. సాయంత్రం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుని తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


మృతి చెందిన శంకర

ములకలచెరువు,మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో మదనపల్లె వాసి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన కంపోళ్ల శంకర(40) టెంపో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన అత్తగారి ఊరైన గూడుపల్లె పంచాయతీ కనుగొండవారిపల్లెలో జాతర కు హాజరయ్యేందుకు సోమవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు బురకాయలకోట సమీపంలో అతను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనా న్ని ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శాంత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నరసింహుడు పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్ అదుపు తప్పి..

ఖాజీపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్కూటరు అదుపుతప్పడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకుబుడ్డాయపల్లెకు చెందిన చిల్లకోటి చక్రవర్తి(29) గత రాత్రి ఖాజీపేట నుంచి బుడ్డాయపల్లెకు స్కూటర్‌పై బయలుదేరాడు. అయితే, సైడ్ స్టాండు తీయక పోవడంతో బుడ్డాయపల్లె ఎస్సీ కాలనీ వద్ద వాహనం అదుపుతప్పి కింద పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


అదృశ్యమైన వృద్ధుడు

కడప క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తన తండ్రి కనిపించడంలేదని నగర పరిధిలోని ఆర్వీఎస్ నగర్‌కు చెందిన వ్యకి ఫిర్యాదు చేసినట్లు చిన్నచౌకు ఎస్‌ఐ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమ వారం ఉదయం 10.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన రాజు రామసుబ్బారెడ్డి (74) మధ్యాహ్నమైనా తిరిగి రాకపోవ డంతో అతని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని చేతిలో వాకింగ్ స్టిక్ ఉందని, ఎత్తు 6.1 అడుగులు, ఛామనఛాయతో సన్నగా ఉంటాడని, లైట్ కలర్ షర్టు, ప్యాంటు ధరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు చిన్న చౌకు పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టరు మొబైల్ నెం.9121100520, ఎస్‌ఐ 9121100521 నెంబర్లకు కాల్ చేసి తెలపాలని కోరారు.

ఆర్థిక సమస్యలు తాళలేక ఆత్మహత్య


రఘురామయ్య మృతదేహం

రాజంపేట టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక యాసిడ్ తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసు కున్నాడు.పుల్లంపేట మండలం తిప్పాయపల్లెకు చెందిన దార్ల రఘురామయ్య పట్టణంలోని నూనెవారిపల్లె రోడ్డులో 17 ఏళ్లుగా నివాసముంటూ కూలి పనులతో కుటుంబాన్ని పోషించేవాడు. మార్చి 6న అప్పుల బాధ తట్టుకోలేక ఆదివారం రాత్రి యాసిడ్ తాగాడు. విషయం గమనించిన భార్య వరలక్ష్మి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు రాజంపేట పట్టణ పోలీసులుతెలిపారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

రాజంపేట టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని హస్తవరం చెర్లోపల్లె సమీపంలోని రైలు పట్టాలపై సోమవారం తలకు తీవ్రమైన గాయంలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతి చెందిన వ్యక్తికి 30 ఏళ్ల వయసుంటుందని, తెల్ల రంగు గళ్ల చొక్కా ధరించాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వాసుపత్రిలోని మార్చురికి తరలించారు.

దాడి కేసు నమోదు

ఎర్రగుంట్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): డబ్బు అడిగినందుకు సోమవారం తనపై దాడిచేశారని ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్ వెనుకవైపు నివాసముంటున్న షేక్ ఖాదర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. నజీర్, ఇంకా కొందరు ఈ దాడిలో పాల్గొన్నట్లు ఫిర్యాదులో పేర్కొనడంతో విచారణ చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డుకు అడ్డంగా వాహనం పెట్టారని గొడవ

ప్రకాష్‌నగర్ వీధిలో రోడ్డుకు అడ్డంగా వాహనం పెట్టారంటూ గొడవ పడడంతో కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దండు సతీష్ కుమార్ రోడ్డుకు అడ్డంగా వాహనం నిలిపాడంటూ త్యాగరాజు అనే వ్యక్తి ప్రశ్నించాడు. దీంతో మాటామాటా పెరిగి ఘర్షణ జరిగింది. దండు సతీష్‌కుమార్, మరికొందరు తనపై దాడిచేసినట్లు త్యాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అత్తపై కోడలి బంధువుల దాడి

పోట్లదుర్తి ఎన్‌టీఆర్‌కాలనికి చెందిన తెల్లాకుల రాములరమ్మపై ఆమె కోడలు కుళాయమ్మ తల్లిదండ్రులు, బంధువులు సోమవారం దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. భార్యాభర్తల విషయంలో వచ్చిన గొడవలే ఈ దాడికి కారణమన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అడవికి నిప్పు : మామిడి చెట్లు దగ్ధం


కాలిపోయిన మొక్కలు

సుండుపల్లె, మార్చి31(ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు నిప్పంటించడంతో అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న మామిడి తోటలకు మంటలంటుకున్నాయి. మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ కటారుముడుకు సమీపంలోని అటవీ ప్రాంతానికి సమీపంలోని మిట్టబిడికికి చెందిన మూడే లక్ష్మమ్మతో పాటు మరికొంత మందికి చెందిన కంచె, పైపులు స్టార్టరుతోపాటు సుమారు 50కి పైగా మామిడి చెట్లు దగ్ధమైనట్లు రైతులు తెలిపారు. పొలాలు, తోటల సమీపంలో అడవికి నిప్పు పెట్టకుండా అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

కొండపేట చెరువు విస్తీర్ణం వందెకరాలు.. ఆయకట్టు ఐదొందల ఎకరాలు. కొన్నేళ్లుగా ఈ చెరువు కొద్దికొద్దిగా ఆక్రమణకు గురవుతూ ప్రస్తుతం ముప్పాతిక భాగం మాత్రమే మిగిలింది. ఇదేమని ప్రశ్నిస్తే చెరువులో సాగు చేసుకుంటే మీకేం ఇబ్బంది అంటూ ఆక్రమణదారులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఇక అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వందెకరాల చెరువు!



- పాతిక భాగం పైగానే ఆక్రమణ
- అక్రమంగా వరి సాగు
- ఆందోళనలో కొండపేట చెరువు ఆయకట్టు రైతులు
- పట్టించుకోని అధికారులు

చెన్నూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు చెరువుల్లో పెద్దదైన కొండ పేట చెరువు వంద ఎకరాల్లో ఉన్నప్పటికీ పాతిక ఎకరాలకు పైగానే ఆక్రమణల బారిన పడడంపై ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేఐస్తున్నారు. సుమారు 500 ఎకరాలకు సాగు నీరందించే కొండపేట చెరువుకు బ్రిటిషర్ల హయాం నుంచీ నీటి కేటాయింపు ఉంది. వర్షాకాలంలో చివరి దశలో కేసీ కాల్వ నీటితో ఈ చెరువు నింపితే, రైతులు వరితో పాటు ఇతర పంటలు సాగు చేసుకుంటారు. అయితే, గ్రామానికి చెందిన పలువురు గత 15 ఏళ్లుగా చెరువును కొద్దికొద్దిగా ఆక్రమించుకుంటూ సుమారు 30 ఎకరాల మేర కబ్జా చేసి వరి సాగు చేసుకుంటున్నారు. ఇదేమని ఇతర రైతులు ప్రశ్నిస్తే ఈ చెరువేమన్నా నీదా, మేం సాగు చేసుకుంటే మీకేం ఇబ్బంది, అధికారులే పట్టించుకోలేదు, మీకేం అవసరం అంటూ సమాధానం ఇస్తున్నారు.


చెరువు ఆక్రమించి సాగు చేస్తున్న వరి పైరు

ఆయకట్టు రైతుల ఆందోళన

కేసీ కాల్వకు అనుబంధంగా కొండపేట చెరువు ఆయకట్టు ఉన్నా నీరిచ్చేది మాత్రం నవంబరు, డిసెంబరు నెలల్లోనే. ఈ చెరువు ఒక్కసాగుకు మాత్రమే నీరందిస్తుంది. 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి. చెరువులో నీరు లేనప్పుడల్లా ఇష్టానుసారంగా తవ్వకాలు జరుగుతు న్నాయి. గ్రావెల్‌తో మండలంలో ఎవరికి అవసరం వచ్చినా ఎలాంటి అనుమతులు లేకుండానే కొండపేట చెరువులో ఎక్కవేటర్లతో తవ్వి తరలిస్తుంటారు. ఇలాంటి వారికి స్థానికులే సహకారం అందిస్తూ తాము కూడా సొమ్ము చేసుకుంటున్నారు. నీరు లేని సమయంలో ఈ చెరువును చూస్తే చెరువు నిండా గుంతలే. ఈ గోతుల కారణంగా మనుషులు, పశువులు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి.

నిర్లక్ష్యం వహిస్తే కనుమరుగే..

ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు చెరువుకు హద్దులు కేటాయించలేదు. చెరువు మధ్యలో సర్వేరాయి ఉందని కొందరు రైతులు చెబుతున్నా మొత్తం విస్తీర్ణంపై కొలతలు వేయాల్సి ఉంది. నాలుగు వైపులా హద్దులు ఏర్పాటు చేయాలి. ఆక్రమణలు తొలగించాలి, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో సంప్రదించి చెరువును పూర్తి విస్తీర్ణంతో అప్పగించాల్సిన బాధ్యత ఉందని రైతులు అంటున్నారు.

ఆక్రమణలపై దృష్టి పెడతాం

చెరువును ఆక్రమించడంనేరం. ఇది ఆయకట్టు రైతులకు ఆందోళన కలిగించే అంశం. చెరువులో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. గతంలో కూడా ఈ చెరువు విషయంలో గట్టి చర్యలు తీసుకున్నాం. నీటి పారుదలశాఖ పరిధిలోకి వచ్చే చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవు.

- సుబ్బరాయుడు, ఏఈ, ఇరిగేషన్ శాఖ

జిల్లాలో రూ.3.59 కోట్లతో పశువుల నీటితొట్లు

- రూ.40 కోట్లతో సిమెంటు రోడ్డు పనులు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


పశువుల తొట్టి పనులకు పూజలు చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల దాహం తీర్చేందుకు ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.3.59 కోట్లతో 1,115 పశువుల నీటి తొట్లు నిర్మిస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం నారాయణరెడ్డిపల్లె , కొండావాండ్లపల్లెలో పశువుల నీటితొట్ల పనులను డీడబ్ల్యూఎంఏ పీడీ వెంకటరత్నం, ఎంపీడీవో రామచంద్ర, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. సంబేపల్లె మండలంలో 28 పశువుల నీటి తొట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కో నీటితొట్టికి ఉపాధి హామీ పథకం కింద రూ.32,200, పని ప్రదేశంలో బోర్డు ఏర్పాటుకు రూ.1000 చెల్లిస్తున్నట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే గ్రామాల్లో రూ.40 కోట్లతో సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు బావులను తవ్విస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.300 కోట్లతో 6 మండలాల్లో 780 పల్లెలకు వెలిగల్లు ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఏపీవో రెడ్డి జవహర్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంపై తేనెటీగల దాడి


చికిత్స చేస్తున్న డాక్టర్ రాజశేఖర్

ఓబులవారిపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాపిరెడ్డిపల్లెలోఉన్న జీవన జ్యోతి ఆనందనిలయం ఆశ్రమంపై తేనెటీగలు దాడి చేశాయని ఆశ్రమ వ్యవస్థాపకుడు పాణ్యం సుబ్రమణ్యం తెలిపారు. ఆశ్రమం ప్రాంగణంలోని తేనె తుట్టెలపై ఆకతాయిలురాళ్లు వేయడంతో, ఒక్కసారిగా తేనెటీగలు రేగాయి ఈ దాడిలో 8 మంది వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను 108 వాహనం ముక్కావారిపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వివరించారు. ఆకతాయిలపైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు తెలిపారు.

పార్టీల ఐక్యతతోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా..

● ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దశరథరాం రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దశరథరాంరెడ్డి

కడప మారుతీనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలని ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్. దశరథరాంరెడ్డి కోరారు. ఆల్ ఇండియా జై హింద్ పార్టీ , సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అనుసరించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోవడంతో, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రంగా మారిం దన్నారు. పైపెచ్చు కేంద్రం ఇచ్చిన ప్రత్యేక రాష్ట్ర హోదా హామీ సాకారం చేసుకోలేక పోయామన్నారు. విభజన బిల్లు చర్చ సందర్భంగా నాటి ప్రధాని మన్ మోహన్‌సింగ్ రాజ్యసభలో ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఒడిశా, బుందేల్‌ఖండ్ తరహా పథకాలను అమలు చేస్తామని, పోలవరం ప్రాజెక్టును పూర్తి కేంద్రమే పూర్తి చేస్తుందని హామీ ఇచ్చారని తెలిపారు. ఐఐటీ, ఐఎన్‌టీ, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, ఏఐఎంఎస్ తరహా హాస్పిటల్స్, దుగరాజు పట్నం పోర్ట్, కడపలో స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, ఇండస్ట్రియల్ కారిడార్ తదితర హామీలను నెరవేర్చడంలో కేంద్రం నిమ్మకు నీరెత్తిన ట్లుగా వ్యవహరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావా లని దీక్షలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రస్తుతం ప్రత్యేక హోదా అడగలేని అసహాయస్థితిలో ఉన్నారన్నారు. స్వీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను త్యాగం చేస్తున్న తీరు దారుణమ న్నారు.. ప్రత్యేక హోదా మరుగున పడిన అంశమే కానీ మరచిన అంశం కాదన్నారు. ఇప్పటికైనా ప్రత్యేక హోదా కోసం అన్ని రాజకీయ పార్టీలు సంఘటితమై ప్రత్యేక కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి పరిశ్రమలు, పన్ను రాయితీలు వస్తాయన్నారు. దీంతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఆ దిశగా అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి రావాలని కోరారు. నాయకులు మర్రి రాజా శ్రీనివాస రావు, సీపీఎం నాయకులు చంద్రశేఖర్, సి.ఆర్.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ఆర్టీసీ అధికారుల వైఖరికి అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన


ఆందోళన చేస్తున్న అద్దెబస్సుల డ్రైవర్లు

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 31(ఆంధ్రజ్యోతి): హైర్డ్ బస్సు డ్రైవర్ చక్రవర్తి(30) ఆత్మహత్య కు ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో సోమవారం అద్దె బస్సుల డ్రైవర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 నెలలుగా ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో పరిధిలో అద్దె బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న చక్రవర్తి , ఖాజీపేట మండలం బుడ్డాయపల్లె నుంచి డ్యూటీకి వచ్చి వెళ్లేవాడన్నారు. బస్ పాస్ రెన్యువల్ కోసం డీఎం కార్యాలయంలోని క్లర్క్ శంకర్ గౌడ్‌ను కోరాడు. మూడు రోజులు తిప్పుకున్న ఆ ఉద్యోగి రెన్యువల్ చేయకపోవడంతో, చక్రవర్తి మద్యం సేవించి క్లర్క్ పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో అతనిపై అక్రమంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయించి కేసు నమోదు చేశారన్నారు. ఈ విషయంపై డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి, రీజనల్ మేనేజర్ గోపాల్ రెడ్డి వద్దకు పలుమార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో విసిగివేసారి పోయాడన్నారు. జనవరి 25 నుంచి డ్యూటీలోకి తీసుకోకపోవడంతో మనస్తాపం చెందిన అతను బైక్‌తో లారీని ఢీకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య తెలిపిందన్నారు. ఇలాంటి సమస్యలు మరల పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం తోపాటు, మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో ప్రైవేట్ బస్సుల మేనేజర్లు సాల్మన్, డానియేల్, నరేష్, శ్రీను ప్రైవేట్ బస్ డ్రైవర్లు గోవర్ధన్ రెడ్డి, ప్రసాద్, పవన్. బాబ్జి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుల ఘర్షణ : ఇద్దరికి గాయాలు

కమలాపురం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని ఆక్సానగర్‌కు చెందిన యువకుల ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు ర్యాష్ డ్రైవింగ్ విషయంలో సాల్మన్ అనే యువకుడిని పలుసార్లు షాబాజ్, సోయల్ అనే యువకులు మందలించారు. ఆ విషయం మనసులో పెట్టుకున్న సాల్మన్ రంజాన్ రోజు రాత్రి మద్యం తాగి ఆక్సా నగర్‌కు వచ్చాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేయడంతో షాబాజ్, సోయల్ గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. ప్రాథమిక చికిత్స అనంతరం బాధితులను రిమ్స్‌కు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అనారోగ్యంతో డీవైఈవో మృతి


డీవైఈవో చంద్రశేఖర్(ఫైల్)

మదనపల్లె టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం ప్రశాంతనగర్‌లో నివాసముంటున్న చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి చెందారు. గత వారం రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్న ఆయన సోమవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన స్వగ్రామం దేవళ చెరువులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్టీయూ నాయకులు రమణప్ప, మధుసూదన్ ఒక ప్రకటనలో ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటాం

ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

వీరపునాయునిపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అడవి చెర్లోపల్లె గ్రామంలో రాష్ట్ర టీడీపీ బీసీసెల్ కార్యదర్శి గండి ఓబయ్య యాదవ్ ఇచ్చిన విందుకు ఆయన హాజరయ్యారు. మండల పరిధిలో నెలకొన్న సమస్యలపై దృష్టిపెట్టారు. అలిదెన, మిట్టపల్లె, కొమ్మద్ది ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఉందని, బోర్లు ఎండిపోయాయని ఎమ్మెల్యేకు తెలియజేశారు. త్వరలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తా సాయి నరసింహారెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు సూరారెడ్డి, శివ, అడవిచెర్లోపల్లె గంగిరెడ్డి, శేఖర్‌రెడ్డి, యు.వెంకటాపురం, వీరయ్య, వెల్లుర్తి సీతారామయ్య ఎస్‌ఆర్‌పేట లోకేష్‌యాదవ్, మిట్టపల్లె ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూరిబాబుకు స్వర్ణకలశం ఉగాది పురస్కారం

కడప ఎడ్యుకేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయుడు సూరిబాబు స్వర్ణ కలశం శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది పురస్కారం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లె త్యాగరాయ గానసభలో మహతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బూర్గుల మధుసూదన్ చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

ఘనంగా కమ్మేటిపల్లె నారాయణస్వామి తిరునాళ్లు

సీకేదిన్నె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కమ్మేటిపల్లె నారాయణస్వామి తిరునాళ్లు సోమవారం ఘనంగా నిర్వహించారు. కమ్మేటిపల్లె నారాయణస్వామి, రామయ్యస్వామి, కంటిపాపులమ్మలకు భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. తిరుణాళ్ల సందర్భంగా భక్తులకు గ్రామస్థులు విందు భోజనాలు, మజ్జిగ, మంచినీరు, అందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సమీపంలోని కాశినాయన ఆలయంలో కూడా అన్నదానం నిర్వహించారు.

నగరంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఏర్పాటు చేయాలి

డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : నగరంలో సమ్మర్ స్టోరేజ్ ఏర్పాటు చేసి ప్రజల దాహార్తికి ఇబ్బందులు లేకుండా చర్యలుచేపట్టాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెన్నానదిలో మోటార్లు బిగించి బండి కనుమ వాటర్ గండి వద్ద క్లోరిన్ కలిపి నేరుగా నగరంలోని ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని పంపిణీ చేస్తున్నారు.మోచంపేట, నాగరాజుపేట, బెల్లంమండి, అగాడి ఓవర్ హెడ్ ట్యాంకులనుంచి డిస్ట్రిబ్యూటరీ పైపు లైన్లు మురుగు పారే ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రజలంతా ఫిల్టర్ నీటిని తాగు తున్నారని, నగర పాలక సంస్థ వెంటనే సమ్మర్ వాటర్ స్టోరేజ్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని ఆమె ఆప్రకటనలో డిమాండ్ చేశారు.

కరువు భత్యాన్ని ప్రకటించండి

కడప ఎడ్యుకేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు భత్యం ప్రకటించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం ఒక కరువు భత్యాన్ని అయినా ప్రకటించాలని తెలిపారు. పీఆర్సీ గడువు దాటి రెండు సంవత్సరాలు దగ్గర పడుతున్న ఐఆర్ ఊసే లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. అనంతరం కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఉమాకాంత్, మహిళా కార్యదర్శి పద్మజ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కడప క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా సోమవారం పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానితులను విచారించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డుభద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. సెల్‌ఫోను డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తరలిస్తే చర్యలు తప్పవన్నారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు చేపట్టారు.

ట్రాక్టర్ కిందపడి ఒకరికి తీవ్ర గాయాలు

చెన్నూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఇటుకలబట్టీల వద్ద సోమవారం రాత్రి ట్రాక్టర్ తిరగబడి ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. ఖాజీపేట మండలం చెక్కముక్కపల్లెకు చెందిన ప్రతాప్‌రెడ్డి దౌలతాపురం క్రాస్‌రోడ్డు నుంచి కొండపేటకు వెళ్లే దారిలో ఇటుకల బట్టీలు నిర్వహిస్తూ సోమవారం తానే ట్రాక్టర్‌తో మట్టిని కలియతిప్పుతుండగా ఒక్కమారుగా ట్రాక్టర్ తిరగబడి తీవ్రగాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం అతడిని కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

చెన్నూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పవిత్రమైన రంజాన్ మాసంలో అల్లాహ్ పట్ల చూపించే భక్తి, ఉపవాసదీక్షలు, పవిత్రమైన పద్ధతులు ఎంతో పుణ్యం ఇస్తుందని ఇదే అల్లాహ్ ప్రజలకు ఇచ్చిన సందేశమని గురువు ముఫ్తి ఇషాక్ అహ్మద్ అన్నారు. చెన్నూరు హజ్‌హౌస్ వద్ద రంజాన్ పండుగ పురస్కరించుకుని ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. హజ్‌హౌస్‌తో పాటు చెన్నూరు ఖిల్లామసీదు, షాహిమసీద్, కొండపేట, రామనపల్లె, నజీర్‌బేగ్‌పల్లె, ముండ్లపల్లె తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను జరిపారు.



చెన్నూరులో..



వల్లూరు మండలం పెద్దపుత్తలో..



లింగాలలో...



సింహాద్రిపురంలో...

వల్లూరు..: రంజాన్ పండుగను వల్లూరునే కాకుండా దిగువపల్లె, పెద్దపుత్త, కోట్లూరు, వీజీపల్లె తదితర ప్రాంతాల్లో ముస్లింలు నిర్వహించారు.

లింగాల..: మండల వ్యాప్తంగా ముస్లింలు సోమవారం రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. లింగాల, పార్నపల్లె, మురారిచింతల, పెద్దకుడాల, వెలిదడ్ల గ్రామాలలో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

పులివెందుల రూరల్..: రంజాన్ పండుగను పురస్కరించుకొని పులివెందుల లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పార్నపల్లె రోడ్డులోని ఈద్గా, శ్రీరామహాల్ సర్కిల్‌లోని ఈద్గాతో పాటు మండలంలోని గ్రామాల్లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలునిర్వహించారు. కాగా ఎటువంటి సంఘటనలు జరగకుండా ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య ఆధ్వర్యంలో ఎస్‌ఐ నారాయణ, పోలీసులు ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

వీరపునాయునిపల్లె..: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మండల పరిధిలోని యు.రాజుపాలెం, నేలతిమ్మాయపల్లె, ఉరుటూరు, ఎన్.పాలగిరి గ్రామాల్లో ప్రార్థనలు చేశారు.

సీకేదిన్నె..: చింతకొమ్మదిన్నెలో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ఈద్గాల్లో ప్రార్థనలు నిర్వహించారు.

సింహాద్రిపురం..: సింహాద్రిపురంలోని ఈద్గా మైదానంలో సోమవారం ముస్లింలు రంజాన్ భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. గురిజాల మసీదులో మత పెద్దలు పార్థనలు చేశారు.

చక్రాయపేట..: మండలంలోని ఉప్పలవాండ్లపల్లె, నాగులగుట్టపల్లె, కుప్పం, కుమార్లకాల్వ, గండికొవ్వూరు, మారెళ్ల మడక, ఎర్రగుడి గ్రామ ప్రాంతాల్లో ముస్లింలు ఈద్గాకు వెళ్లి ప్రార్థనలు చేశారు.

కమలాపురం రూరల్..: మండల పరిధిలో రంజాన్ వేడుకలు ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. కమలాపురం ,చిన్నచెప్పలి, పెద్ద చెప్పలి, విభరాపురం, పందిళ్లపల్లె, వెంకటా పురం తదితర గ్రామాల్లో ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్ బాషా ఏర్పాటు చేసిన విందులో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి,ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె..: వేంపల్లెలో రంజాన్ పండుగను ముస్లింలు వేడుకగా జరుపుకొన్నారు. గండిరోడులోని మర్కస్ మసీదు నుంచి ర్యాలీగా పట్టణ పురవీధుల్లో బయలుదేరారు. చేతికి నల్లబ్యాడ్జీ ధరించి నిరసన తెలిపారు. వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా తమ అసంతృప్తి ని వెలిబుచ్చారు. అనంతరం ఈద్గాలో ప్రార్థనలు చేశారు.

కడప నాగరాజుపేట..: నగరం సమీపంలోని మాచుపల్లెలోని తురకపల్లె వద్ద గల ఈద్గాలో రంజాన్ పురస్కరించుకొని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కడప నుంచి కూడా ముస్లింలు అక్కడకు వెళ్లి ప్రార్థనలు చేస్తారు.



వేంపల్లెలోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చక్రాయపేటలో...



కమలాపురంలో..



వీరపునాయునిపల్లెలో



పులివెందులలో..



కడప మండలంలోని తురకపల్లెలో..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వల్లూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కడప - తాడిపత్రి రహదారిలోని తోళ్లగంగనపల్లె గ్రామ సమీపంలో ఉన్న ఆయిల్ మిల్లు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. వివరాల మేరకు కడప వైపు నుంచి ఎర్రగుంట్ల వైపు వెళుతున్న కారు వల్లూరు నుంచి కడప వైపు ద్విచక్ర వాహనంలో వెళుతున్న అజీజ్‌ను ఢీకొన్న సంఘటనలో ద్విచక్రవాహనంలోని వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు వారు తెలిపారు. సంఘటనాస్థలిలో స్థానికులు ఉండడంతో వారు 108కు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం అజీజ్‌ను కడప రిమ్స్‌కు తలరించారు. విషయం తెలుసుకున్న వల్లూరు పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి విచారించారు. కాగా రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందన్నారు. కాగా అజీజ్ ఖాజీపేట మండలం ములపాక గ్రామ నివాసిగా గుర్తించినట్లు తెలిపారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



ఆర్‌ఆర్ నగర్ అభివృద్ధి ఎక్కడ..?

- సిమెంటు రోడ్డు లేక ఇబ్బందులు
- మురుగునీటితో సమస్యలు



సిమెంట్ రోడ్డులేక అధ్వానంగా ఉన్న రహదారి

కడప(వినాయకనగర్), మార్చి31(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని రావ్ఎక్రిష్ణనగర్‌లో సిమెంటు రోడ్లలేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. కనీసం డ్రైనేజీ కాలువలు లేక మురుగునీరు రోడ్లపైకి రావడంతో దోమల బెడదతో చివరి వరకు ఒకే ఒక సిమెంటు నిర్మించారు. ఈ రోడ్డు కూడా గుంతలమైనది. ఇంకా పలు వీధుల్లో సిమెంటు రోడ్లు లేవు. ఇళ్లలోని మురుగునీరు బయటకు వెళ్లడానికి కనీసం డ్రైనేజీ కాలువలు కూడా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీలో 6 వేలకు పైబడి జనాభా ఉన్నారు. కాలనీ నిర్మితమైనప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీల ద్వారా నిర్మితమైన కాలనీని ప్రధాన పార్టీ నాయకులు ఎవరూ పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

బియ్యం బస్తాలు పంపిణీ



కమలాపురం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసంలో పేద ప్రజలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం పుణ్యకార్యంగా భావిస్తున్నామని షిరిడీ సాయి రైస్‌మిల్ యజమాని, మాజీ ఉపసర్పంచ్ తిప్పాయపల్లె సుబ్బారెడ్డి తెలిపారు. ఇందిరమ్మ కాలనీ, రైల్వేగేటు, బీడీకాలనీకి చెందిన 60 కుటుంబాలకు ఆయన బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ మైసూరారెడ్డి, ఎర్రబల్లి సుబ్బారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

కమలాపురం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర కరువు పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న కమలాపురం నియోజకవర్గాన్ని కరువుప్రాంతంగా ప్రకటించకపోవడం రైతులు కడుపు కొట్టినట్లేనని తెలుగునాడు ప్రజాసేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వైసీపీ రాష్ట్ర నాయకుడు కాశీభట్ల సత్యసాయినాథశర్మ ఆవేదన వ్యక్తం చేశారు. కమలాపురం నియోజకవర్గంలోని కమలాపురం, వల్లూరు, పెండ్లిమర్రి, సీకేదిన్నె, వీరపునాయునిపల్లె, చెన్నూరు మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం చాలా విచాకరమన్నారు. కరువు మండలాలజాబితాలో కమలాపురం నియోజకవర్గంలోని ఆరుమండలాల్లో ఒక్క మండలం కూడా లేకపోవడం దారుణమన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



పులివెందుల..శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు తిలకిస్తున్న సందర్శకులు

పులివెందుల రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం, రంజాన్ సందర్భంగా పట్టణంలోని శిల్పారామం, ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్‌లలో ప్రజలు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. పండుగలను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శిల్పారామం,ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ పరిపాలన అధికారి టి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో శిల్పారామంలో యువరాజా డ్యాన్స్ బృందం, ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో మాస్టర్ శ్రావణ్ బృందంచే నృత్య ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. పండుగ వేళ పిల్లలు, పెద్దలు ఆహ్లాదకర వాతావరణంలో కలియతిరుగుతూ నృత్య ప్రదర్శనలు తిలకించి ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పారామంలో రంజాన్ సంబరాలు

కడప కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదిన సందర్భంగా నగర రిమ్స్ సమీప శిల్పారామంలో రంజాన్ సంబరాలు వేడుకలు ఘనంగా జరిగాయి. సంబంధిత పరిపాలనాధికారి కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో నగరంలోని వేదం డ్యాన్స్ అకాడమీ విద్యార్థులచే పలు సినిమా, జానపద గీతాలకు విద్యార్థులు ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకున్నాయి. ప్రధానంగా ఇందులో గోదారి గట్టు మీద రామచిలకవే.. అనే పాట పలు హిందీ గీతాలకు చేసిన స్టెప్పులు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి.



కడప శిల్పారామంలో స్టెప్స్ వేస్తున్న విద్యార్థులు



పులివెందుల శిల్పారామంలో నృత్యం చేస్తున్న దృశ్యం



పులివెందులలో...

దాల్మియా పరిశ్రమతో దగా

● ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మైలవరం మండలం దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పడినప్పటి నుంచి చుట్టుపక్కల గ్రామాల రైతులు, పేద ప్రజలు దగా పడ్డారని బాగుపడిన వారెవరూ లేరని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శించారు. సోమవారం జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. దాల్మియా సిమెంటు పరిశ్రమ రెండవ దశ నిర్మాణంలో బాధిత గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా ఫ్యాక్టరీకి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ సమస్యలేమీ లేనట్లుగా పని పూర్తి చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా దాల్మియా వలన నష్టపోతున్న ప్రజలను, రైతుల పొలాలు, ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించిన తర్వాత రెండవ దశ నిర్మాణానికి వెళ్లాలని అప్పటిదాకా నిర్మాణం చేపట్టవద్దని ఎమ్మెల్సీ హెచ్చరించారు. లేదంటే ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నకొమెర్ల సర్పంచు జగదీశ్వరరెడ్డి, ఆయా గ్రామాల రైతులు, దళితులు పాల్గొన్నారు.

వైభవంగా చల్ల కార్యక్రమం

ముద్దనూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక రామాలయం వీధిలో ఉగాది పర్వదినంలో భాగంగా కర్ణమయ్య ఇంటి వద్ద సోమవారం చల్ల కార్యక్రమం నిర్వహించారు. రామాలయం పూజారి రామయ్య ఆధ్వర్యంలో చల్ల ఏర్పాటు చేశారు. తలారి వీధిలో నున్న పెద్దమ్మతల్లికి పూజలు చేసి, ప్రజలకు చల్ల ఏర్పాటుచేశారు. గ్రామానికి ఎటువంటి సమస్య తలెత్తకుండా చల్లగా ఉండేందుకు చల్ల కార్యక్రమం ప్రతి ఏటా నిర్వహిస్తుంటారు.

ఘనంగా రంజాన్

పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. నెలరోజుల ఉపవాసం తర్వాత సోమవారం పండుగను పురస్కరించుకుని ఆయా ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పండుగను పురస్కరించుకుని కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గా మైదానంతో పాటు ఆర్‌అండ్‌బీ బంగ్లా, పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మౌలానా మేరాజ్ రజా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అల్లాహ్ చూపిన శాంతి, దయ, సేవా మార్గంలో నడుచుకోవాలన్నారు. రంజాన్ పండుగ ప్రాముఖ్యతను, ఖురాన్ పవిత్రతను, అల్లాహ్ గొప్పదనాన్ని గురించి వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు వీఎస్ ముక్తియార్, ఖాజీ ఇనాయతుల్లా, అంజుమన్ అహ్లే ఇస్లాం కమిటీ అధ్యక్షుడు బొల్లవరం బాష, కార్యదర్శి ఇలియాస్, దాదాపీర్, మత పెద్దలు, పట్టణంతో పాటు చుట్టుపక్కల పల్లెలకు చెందిన ముస్లింలు ప్రార్థనలో పాల్గొన్నారు.

జమ్మలమడుగు: రంజాన్ పండుగ పురష్కరించుకుని ఈద్గాల్లో భక్తిశ్రద్ధలతో ముస్లింలు ఈదుల్‌ఫితర్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగులోని పెన్నానది పక్కన ఈద్గాలో జామియా మసీదు పీఠాధిపతి షాదిక్ పాషాఖాద్రి ముస్లింలకు రంజాన్ పండుగ, ఈదుల్‌ఫితర్ గురించి వివరించారు. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ లింగప్ప, రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు రామక్రిష్ణ, మైలవరం, తలమంచిపట్నం ప్రాంతాలకు చెందిన ఎస్‌ఐలు, వారి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఎర్రగుంట్ల: నెల రోజుల ఉపవాస దీక్ష అనంతరం ముస్లింలు రంజాన్ పండును భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ఉదయం వలసపల్లె రోడ్డులోని ఈద్గా వద్ద వేలాదిగా చేరుకుని ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు ఇచ్చిన సందేశాన్ని ఆలకించారు.

కొండాపురం: మండలంలో రంజాన్ వేడుకలను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కొండాపురం పట్టణంతో పాటు తాళ్లప్రొద్దుటూరు, దత్తాపురం తదితర చోట్ల ఈద్గా వద్దకు వెళ్లి వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ముద్దనూరు: మండలంలో ముస్లింలు రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ముస్లింలు తాడిపత్రి రోడ్డులోని ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

చాపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లోకి వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు జరిపారు. వెదురూరు, రాజుపాళెం, తిమ్మాయపల్లె, చాపాడు, ఖాదర్‌పల్లె, అల్లాడుపల్లె, అన్నవరం తదితర గ్రామాల్లో ముస్లింలు సంతోషంగా జరుపుకున్నారు.

దువ్వూరు: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షతో అందరూ పునీతులయ్యారని మతగురువు సాబ్జు తెలిపారు. దువ్వూరులో ఈద్గా వద్ద సోమవారం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ముస్లింలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజుపాలెం: రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో ముస్లింలు జరుపుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఉదయాన్నే ముస్లింలు గ్రామాల చివరలో ఉన్న ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పేదలకు దానధర్మాలు చేశారు.

మైదుకూరురూరల్: మైదుకూరులో ముస్లింలు రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ 30 రోజులు కఠోర ఉపవాస దీక్ష చేసి నేడు పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ధనపాల జగన్, ఏపీ రవీంద్ర, పాలమాబు, అమీర్, మిల్లుశ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట: ఖాజీపేట, సరస్‌ఖాన్‌పేట, దుంపలగట్టు, ఆంజనేయకొట్టాలులో ముస్లింలు ఘనంగా రంజాన్ వేడుకలు సోమవారం నిర్వహించారు. అనంతరం మండల ముస్లిం నాయకుడు సిద్దారం కదిరుల్లా ఏర్పాటు చేసిన తేనీటి విందులో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ మెంబర్ అచ్చుకట్ల కరిముల్లా, ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలురూరల్: రంజాన్ సందర్భంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్‌ను ఘనంగా నిర్వహించారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని ఈద్గా వద్ద ఉదయం 7.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు రంజాన్ పర్వదిన ప్రాముఖ్యతను వివరించారు.

పోరుమామిళ్ల: రంజాన్ పురస్కరించుకుని ముస్లింలు వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లోని ముస్లిం సోదరులు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ కాలనీలోని ఈద్గా వద్ద రంగసముద్రం పంచాయతీ సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్ రెడ్డిల సహకారంతో చిత్తా గిరిప్రణీత్‌రెడ్డి ప్రార్థనలకు వచ్చిన వారందరికీ మజ్జిగను అందించారు.





మైదుకూరు ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే, పోరుమామిళ్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, ఖాజీపేటలో ఈద్గాలో ప్రార్థనకు హాజరైన ముస్లింలు



ప్రొద్దుటూరు ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



బద్వేలులో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



చాపాడులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎర్రగుంట్ల ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ముద్దనూరు ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మహిళపై దాడికి యత్నం

ఖాజీపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట బంగ్లా సమీపంలో గల భాగ్యలక్ష్మి అనే మహిళపై గుర్తు తెలియని కొందరు దాడికి యత్నించారు. బాధితురాలి కథనం మేరకు.. కడపకు చెందిన ఓబుల్‌రెడ్డికి తాను దాదాపు రూ.10 లక్షలకు పైగా డబ్బులు ఇచ్చానని, ఆ డబ్బులు కట్టమని అడుగగా అతను సరైన సమాధానం చెప్పకపోవడంతో ఇంటికి తాళం వేశానని తెలిపారు. కాగా ఈ విషయం మనుషులో పెట్టుకొని అతను కడప మాసాపేటకు చెందిన కొందరు యువకులను తనపై దాడికి పంపినట్లు ఆరోపించారు. అయితే ఇరువురు యువకులను పత్తూరు సమీపంలో గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి, స్థానిక పోలీసులకు అప్ప జెప్పినట్లు తెలిపారు. కాగా ఈ విషయంపై రాతపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు.


వైభవంగా పెద్దపీరయ్యస్వామి ఆరాధన ఉత్సవాలు

● అలరించిన వృషభరాజముల బండలాగుడు పోటీలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానకర్త వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియశిష్యుడైన సిద్దయ్యస్వామి పెద్దకుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు గత రెండు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. మఠాధిపతులు కలుగొట్ల సిద్దయ్యస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలను చేపట్టారు. తెల్లవారుజామున స్వామివారిని ముడుమాల గ్రామ పురవీధుల గుండా ఉదయం 8 గంటల నుంచి రసవత్తరంగా చిన్నబండలాగుడు పోటీలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి పెద్దబండలాగుడు పోటీలను చేపట్టారు. అలాగే యువకులకు చిన్న గుండు, పెద్దగుండు పందాలను చేపట్టారు. బండలాగుడు పోటీలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులను అందించారు.



వృషభరాజములు



ప్రత్యేక అలంకారంలో పెద్దపీరయ్యస్వామి

తాళ్లమాపురంలో బండలాగుడు పోటీలు

ప్రొద్దుటూరురూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో ఉగాది పర్వదినం సందర్భంగా వృషభరాజములచే బండలాగుడు పోటీలను నిర్వహించారు. సోమవారం గ్రామంలోని మైసూరమ్మతల్లి ఆశీస్సులతో గ్రామ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో న్యూ కేటగిరి విభాగంలో బండలాగుడు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మొత్తం 9 జతల ఎద్దు పాల్గొని తమ సత్తాను చాటాయి. ఇందులో అనంతపురం జిల్లా అక్కంపల్లికి చెందిన ఇంద్రారెడ్డి ఎద్దు అత్యధిక దూరం 3,500 అడుగులు దూరాన్ని ఛేదించి మొదటి స్థానంలో నిలిచాయి. రెండవస్థానంలో 3,426 అడుగులు దూరాన్ని లాగి బాపట్ల జిల్లా ఉప్పుమాగులూరుకు చెందిన రవిచంద్రారెడ్డి, మూడవ స్థానం 3,210 అడుగులు ప్రకాశం జిల్లా పొట్లపాడుకు చెందిన గొల్లపల్లి రామ్‌చరణ్, బయపురెడ్డి కంబైడ్ ఎద్దు, 4వ స్థానం 3,040 అడుగులు లాగి కడప జిల్లా పొత్తురెడ్డిపల్లికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి ఎద్దు, 5వ స్థానం 2,847 అడుగులు కడపజిల్లా నాగాయపల్లెకు చెందిన మైదుకూరు నాగేశ్వరి, వేమారెడ్డి కంబైండ్ ఎద్దు విజేతలుగా నిలిచాయి. విజేతలకు బహుమతి దాతలు మొదటి బహుమతి రూ.60 వేలు దాత (నాగేళ్ల చిన్న అంకిరెడ్డి), రెండవ బహుమతికి రూ.40 వేలు దాత (సుధాశివమోహన్‌రెడ్డి), మాచిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మూడవ బహుమతి రూ.30 వేలు దాత (శివకృష్ణయాదవ్), 4వ బహుమతి రూ.20 వేలు దాత మంచిదేవర సుబ్బయ్య, 5వ బహుమతి దాత రూ.10 వేలు సిగినేని భాస్కర్‌రెడ్డి, కన్సలేషన్ బహుమతులు రూ.5 వేలు దాత నాగేళ్ల శివానందరెడ్డిలు అందించారని నిర్వాహకులు తెలిపారు.



బండను లాగుతున్న ఎద్దులు

వైభవంగా సుంకులాంబ తిరునాళ్లు

మైలవరం, మార్చి 31: మండల పరిధి వద్దిరాలలో వెలసిన సుంకులాంబ పరంజ్యోతి అమ్మవారి తిరుణాల మహోత్సవాలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానికులే కాక నంద్యాల, అనంతపురం, కర్నూలు తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుణాలను పురస్కరించుకుని సుంకులాంబ అమ్మవారిని, ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సిరిమాను మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చెక్కభజన, కోలాటం, సిరిమాను ఉత్సవం, సత్యహరిశ్చంద్ర, నాటకం మొదలైన కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. కాగా జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తదితర నాయకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కాగా టీడీపీ నాయకులు చలివేంద్రం, భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళవారం నుంచి రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తలమంచిపట్నం, మైలవరం ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, శ్యాంసుందర్‌రెడ్డి పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



సిరిమాను ఊరేగింపు మహోత్సవం

పైపులైను సరిచేయండి

● దమ్మనపల్లె ప్రజల ఆవేదన

పోరుమామిళ్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పైపులైన్లు సరిచేసి మురికినీరు రాకుండా చూడాలని దమ్మనపల్లె ప్రాంతానికి చెందిన ప్రజలు కోరుతున్నారు. మండలంలోని దమ్మనపల్లె పంచాయతీ పరిధిలోని దమ్మనపల్లె పాత గ్రామంలో రోడ్డు పక్కన కుళాయి పైపులు ఊడి పడిపోవడంతో నీరు కలుషితమవుతుందని, పైపులైను మరమ్మతులు చేసి కలుషిత నీరు రాకుండా చూడాలని ఆ గ్రామానికి చెందిన ప్రసాద్, మరికొందరు తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి హరిక్రిష్ణను వివరణ కోరగా, రెండురోజుల్లో మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.



దెబ్బతిన్న పైపులైను చూపుతున్న గ్రామస్థులు

గుండెపోటుతో రిటైర్డ్ డీటీ మృతి

బద్వేలురూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంజనేయనగర్‌లో నివాసం ఉండే రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దారు యనమల ప్రభాకర్‌నాయుడు గుండెపోటుతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఆయన కుమారుడు యనమల రాజా తెలిపారు. డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తూ అందరికీ సుపరిచితులైన ప్రభాకర్‌నాయుడు మృతి చెందడంతో పరామర్శించేందుకు పలువురు ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఈయన సోదరుడు యనమల సుధాకర్ పోరుమామిళ్ల సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. బుధవారం పట్టణంలోని బలిజ కోటలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు రాజా తెలిపారు.



ప్రభాకర్‌నాయుడు (ఫైల్)

ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ

ముద్దనూరు, మార్చి 31(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని ముస్లింలకు రంజాన్ పండుగ వేళ సోమవారం మండల బీజేపీ నాయకులు డాక్టర్ మధుసూదనరెడ్డి నిత్యవసరాలను అందించారు. అలాగే మధుసూదనరెడ్డి పెళ్లి రోజు సందర్భంగా కేజీ చికెన్, 10 రకాల కూరగాయలను దాదాపు 600 కుటుంబాలకు ముస్లింల ఇంటింటికీ వెళ్లి అందించారు. ప్రతి ఏటా రంజాన్ పర్వదినాన పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సాగర్, గఫూర్, సుబ్బరాయుడు, వినోద్, దానం, పవన్ పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఘనంగా జ్యోతులు

ఎర్రగుంట్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా స్థానిక చౌడేశ్వరీదేవి అమ్మవారికి జ్యోతులు ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున ప్రకాష్‌నగర్, మహేశ్వర్‌నగర్ నుంచి జ్యోతులు బయలుదేరాయి. పురవీధుల గుండా నృత్యాలు చేస్తూ పెద్దఎత్తున ఊరేగింపుగా వచ్చారు. మొత్తం నాలుగు జ్యోతులు అమ్మవారి వద్దకు చేరుకున్నాయి. అక్కడ పూజలు నిర్వహించారు.



చౌడేశ్వరీదేవి ఆలయం వద్ద ఊరేగుతున్న జోతులు